



# BNS
BHARAT NEWS SPECTRUM

ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్





సంపుటి - 01 సంచిక -70 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 18-03-2026 బుధవారం పేజీలు : 6

## వడ్డీ లేని రుణాలపై సవాళ్ల పర్వం..

### రాజీనామాకు సిద్ధమని కేటీఆర్ సవాల్




హైదరాబాద్ , మార్చి 17(బిఎన్ఎస్): తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయి వాగ్వాదం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టగా, మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలు ఏకమై ప్రతిదాడికి దిగారు. చర్చా సందర్భంలో ఇరుపక్షాల నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకోవడంతో సభలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది.

**ఎగ్గొట్టు.. కూలగొట్టు.. చెడగొట్టు: కేటీఆర్ విమర్శల పర్వం**

చర్చను ప్రారంభిస్తూ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తూ చేసిన తొలి సంతకం ఫైల్ ఏమైందని ఆయన నిలదీశారు. ఆ ఫైలు ఎఫ్ఎస్ఎల్ అగ్నిప్రమాదంలో కాలిపోయిందా లేక మాయమైందా అని ఎద్దేవా చేశారు.

వివరాలు 2లో..

## దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం మరో కానుక


2 లో

**'దివ్యాంగ శక్తి' పథకం ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు**

అమరావతి, మార్చి 17(బిఎన్ఎస్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు ఉగాది కానుక ప్రకటించింది. ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రంలోని దివ్యాంగులు ఉచితంగా ప్రయాణించేలా 'దివ్యాంగ శక్తి' పథకాన్ని తీసుకొచ్చింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పథకానికి బుధవారం అమరావతిలో శ్రీకారం చుడతారు. అలాగే ప్రతీ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే దివ్యాంగ శక్తిని ప్రారంభించనున్నాను. ఈ పథకం ద్వారా కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉంటుందని మరోసారి నిరూపించింది. గతేడాది డిసెంబర్ 3న నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజున దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని మాటిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఈరోజు ఆ మాట నిలబెట్టుకున్నారు.

## ప్రధాని మోదీతో వరుణ్ గాంధీ భేటీ

ఢిల్లీ, మార్చి 17(బిఎన్ఎస్): మాజీ బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీ తన కుటుంబంతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీని ఢిల్లీలో కలుసుకున్నారు. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలను వరుణ్ గాంధీ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఫోటోలు వైరల్ కావడంతో, వరుణ్ గాంధీ మళ్లీ బీజేపీలో క్రియాశీలకంగా మారే అవకాశాలున్నాయని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గతంలో ఫిలిబిత్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన వరుణ్, 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి పక్కన పెట్టబడ్డారు.



## చంద్రబాబు పాలనలో అవినీతి 'అన్‌లిమిటెడ్'

### వైఎస్ జగన్ నిప్పులు

తాడేపల్లి, మార్చి 17(బిఎన్ఎస్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రకాశం జిల్లా ఒంగోలు నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలు మరియు కార్యకర్తలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు.


2 లో

## రైతు భరోసా కొత్త అప్లికేషన్లు ప్రారంభం..

### కావాల్సిన పత్రాలు, ప్రాసెస్ ఇదే!




హైదరాబాద్ ,మార్చి 17(బిఎన్ఎస్): : రైతుల ఖాతాల్లో ఈ నెల 22 నుంచి రైతు భరోసా నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే ఇప్పటి వరకు 'రైతు భరోసా' పొందని రైతులకు సర్కార్ తీపి కబురు చెప్పింది. కొత్తగా రైతుల నుంచి రైతు భరోసాకు అప్లికేషన్లు స్వీకరిస్తోంది. కొత్తగా పట్టా పొందిన (28.02.2026 లోపు) రైతులు దీనికి అర్హులు. రైతు వేదికలు, వ్యవసాయ విస్తరణ అధికారులను కలిసి అప్లికేషన్లు ఇవ్వొచ్చు. అందుకు రైతులు తమ ఆధార్ కార్డు, పట్టా పాస్ పుస్తకం, బ్యాంకు అకౌంట్ జిరాక్స్, రైతు భరోసా అప్లికేషన్ ఫారంతో కలిపి ఇవ్వాల్సి ఉంటుంది.

## డ్రగ్ టెస్టుకు సీఎం సిద్ధం.. కేటీఆర్ సిద్ధమా?

### మహేష్ కుమార్ గౌడ్ సవాల్


2 లో

హైదరాబాద్: రాష్ట్రంలో పెరుగుతున్న డ్రగ్స్ సమస్యపై రాజకీయ వర్గాల్లో చర్చ తీవ్రంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ, తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. శాసన మండలిలో మాట్లాడిన ఆయన, గత పదేళ్లలో గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాల వినియోగం విస్తృతంగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.

డ్రగ్స్ నిర్మూలన కోసం కఠిన చర్యలు అవసరమని పేర్కొన్న ఆయన, ప్రజాప్రతినిధులందరూ డ్రగ్ టెస్టులకు హాజరుకావాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రగ్ టెస్టుకు సిద్ధంగా ఉన్నారని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ముందుకు రావాలంటూ సవాల్ విసిరారు.

"మీరు మీ నాయకుడిని డ్రగ్స్ టెస్టుకు తీసుకురండి.. నేను మా సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తాను" అంటూ ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో గత రెండేళ్లుగా డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

## రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదు..

- ప్రజలు ఆందోళన చెందవద్దు: ముఖ్యమంత్రి చంద్రబాబు
- 14 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ నిల్వలు సిద్ధం
- ఆసుపత్రులు, హాస్టళ్లు, దేవాలయాలకు నిరంతర సరఫరా
- కేజీ బేసిన్ సహజ వాయువును ఇంటింటికీ అందించడమే లక్ష్యం
- డైవర్షన్ అడ్డుకునేందుకు ఈకేవైసీ, ఓటీపీ విధానం తప్పనిసరి



2 లో

అమరావతి, మార్చి 17(బిఎన్ఎస్): రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరాపై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తగినన్ని నిల్వలు అందుబాటులో ఉన్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం ఆర్టీజీఎస్ (RTGS) కార్యాలయం నుండి రాష్ట్రంలో గ్యాస్ సరఫరా మరియు పంపిణీ వ్యవస్థపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి , వివిధ శాఖల ఉన్నతాధికారులతో పాటు గెయిల్ (GAIL), ఓఎన్జీసీ (ONGC) మరియు ప్రముఖ పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే మన ఏకైక లక్ష్యం



మంగళగిరి, మార్చి 17(బిఎన్ఎస్): రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే మన ఏకైక లక్ష్యం కావాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం చేశారు. మంగళగిరి సమీపం చినకాకానిలోని మయూరి టెక్ పార్క్ భవనం ఐదో అంతస్తులో ఏర్పాటుచేసిన ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు(APEDB) నూతన కార్యాలయాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ముందుగా టెక్ పార్క్ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు అధికారులు ఘనస్వాగతం పలికారు.

వివరాలు 2లో..

### మైలవరం పాఠశాలను ఆకస్మికంగా

## తనిఖీ చేసిన మంత్రి లోకేష్

- మధ్యాహ్న భోజనం నాణ్యత స్వయంగా పరిశీలన
- తప్పు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరిక
- విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మెరుగుకు చర్యలు చేపట్టాలని ఆదేశం



విజయవాడ, మార్చి 17(బిఎన్ఎస్): ఎన్టీఆర్ జిల్లా, మైలవరం దేవునిచెరువు తారకరామా నగర్ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల మధ్యాహ్న భోజనం బాగాలేదంటూ పాఠశాల హెచ్ఎం డ్రామా ఆడించిన ఘటన నేపథ్యంలో మంత్రి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తిని నాణ్యతను పరిశీలించారు.

వివరాలు 2లో..

# మైలవరం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి లోకేష్

మొదటి పేజీ తరువాయి

కొత్తగా ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ అందిస్తున్న భోజనం నాణ్యతపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజనం బాగుందని విద్యార్థులు చెప్పారు. ఘటన జరిగిన రోజు, అంతకుముందు భోజనం ఎలా ఉందని విద్యార్థులను మంత్రి అడిగారు. భోజనం బాగాలేకపోతే ముందు తల్లిదండ్రులకు చెప్పాలని విద్యార్థులకు సూచించారు. ఆ తర్వాత భోజనం నాణ్యతపై లీప్ యాప్ ద్వారా తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకుంటామని చెప్పారు. ఇంకోసారి తప్పు జరగకుండా చూసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఇటీవల మధ్యాహ్న భోజనం సరిగా లేదంటూ ఆహారాన్ని విద్యార్థులు డస్ట్ బిన్ లో పడేసిన ఘటనపై సిబ్బందిని ఆరా తీశారు. భోజనం సిద్ధమయ్యాక ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు నాణ్యత పరిశీలిస్తున్నారా అని వాకబు చేశారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రశ్నించారు.

తప్పు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవు

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మీపై పవిత్ర బాధ్యత ఉంది. చిన్న సమస్య ఉన్నా తెలుసుకోవాలి, పరిష్కరించాలి. తప్పు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని, నిర్లక్ష్యంగా ఎవరూ వ్యవహరించవద్దని మంత్రి హెచ్చరించారు. భోజనం నాణ్యతపై ప్రతివారం తల్లిదండ్రులకు ఫోన్ చేయాలని, ఐవీఆర్ఎస్ ద్వారా వారి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలో విద్యాబోధన తీరు, పాఠశాల పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ప్రతి పాఠశాల తనకు ముఖ్యమేనని, అడ్మిషన్ల పెంపుతో పాటు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పాఠశాలలో ఉన్న అంగన్ వాడీ కేంద్రాన్ని మంత్రి సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న ఆహారాన్ని, అంగన్ వాడీ కేంద్రం పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

# డ్రగ్ టెస్టుకు సీఎం సిద్ధం.. కేటీఆర్ సిద్ధమా? : మహేష్ కుమార్ గౌడ్ సవాల్

మొదటి పేజీ తరువాయి



ఇటీవల డ్రగ్స్ కేసులో బీఆర్ఎస్‌కు చెందిన నాయకుడు అరెస్టైన ఘటనను ప్రస్తావిస్తూ, ఆ పార్టీ తీసుకున్న చర్యలపై ప్రశ్నలు లేవనెత్తారు. యువతకు సరైన సందేశం ఇవ్వాల్సిన బాధ్యత నాయకులపై ఉందని ఆయన పేర్కొన్నారు. డ్రగ్స్ సమస్యపై శ్వేతపత్రం విడుదల చేయాలని కూడా డిమాండ్ చేశారు.

డ్రగ్స్ కేసుల్లో ఎవరైనా పెద్దలు ఉన్నా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన మహేష్ కుమార్ గౌడ్, ఎన్నికల్లో అభ్యర్థులకు బీ–ఫారమ్ ఇవ్వడానికి ముందు డ్రగ్ టెస్టులు నిర్వహించాలని సూచించారు. కొందరు నాయకులు డ్రగ్స్ వ్యాపారంలో పాల్గొంటున్నారనే ఆరోపణలు కూడా చేశారు.

అదేవిధంగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు గ్యారంటీల అమలులో ముందంజలో ఉందని పేర్కొన్నారు. గాంధీ విగ్రహం అంశంపై ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. మూసీ నది అభివృద్ధి లేకపోతే పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు.

సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం తాత్కాలికమని, ప్రజలు వాస్తవాలను గుర్తిస్తారని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికల్లో వంద సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# చంద్రబాబు పాలనలో అవినీతి 'అన్‌లిమిటెడ్': వైఎస్ జగన్ నిప్పులు



తాడేపల్లి, మార్చి 17(బిఎన్ఎస్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రకాశం జిల్లా ఒంగోలు నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలు మరియు కార్యకర్తలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ వైఫల్యాలు మరియు పార్టీ బలోపేతంపై ఆయన దిశానిర్దేశం చేశారు. సుమారు గంటన్నర పాటు సాగిన ఈ భేటీలో చంద్రబాబు పాలనపై జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

అప్పుల కుప్పగా ఆంధ్రప్రదేశ్.. దోపిడీయే ధ్యేయం

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మొత్తం అప్పులు రూ. 3.31 లక్షల కోట్లు ఉంటే, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన కేవలం రెండు ఏళ్లలోనే అప్పులు రూ. 3.20 లక్షల కోట్లకు చేరాయని జగన్ గణాంకాలతో సహా వివరించారు. "ఇంత భారీ ఎత్తున అప్పులు చేస్తున్నా, ప్రజలకు ఉపయోగపడే ఒక్క పథకమైనా అమలవుతుందా?" అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర సంపదను చంద్రబాబు తన బినామీలకు, ఎల్లో మీడియా యాజమాన్యాలకు దోచిపెడుతున్నారని, ఇసుక నుండి మద్యం వరకు ప్రతిచోటా దోపిడీ సాగుతోందని ధ్వజమెత్తారు. అసెంబ్లీలో తప్పుడు లెక్కలు చూపిస్తూ ప్రజలను మరియు కేంద్రాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు.

వ్యవస్థల విధ్వంసం.. టీటీడీ వివాదంపై ఆగ్రహం

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను చంద్రబాబు రాజకీయాల కోసం వాడుకుంటున్నారని జగన్ మండిపడ్డారు. తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను టీటీడీ ఛైర్మన్‌గా నియమించడం ద్వారా హిందూ ధర్మ పవిత్రతను కించపరిచారని విమర్శించారు. లడ్డూ ప్రసాదంపై అసత్య ప్రచారాలు చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీశారని, ఇప్పుడు అదే ఆలయ పరిపాలనలో సొంత కంపెనీలకు ప్రయోజనం చేకూర్చేలా నెయ్యి కొనుగోలు టెండర్లు ఇస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒంగోలు నేతలకు దిశానిర్దేశం

ఒంగోలు ప్రాంతంలో స్థానిక సంస్థల ప్రతినిధులపై జరుగుతున్న వేధింపులను జగన్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. వైసీపీ నాయకులను భయపెట్టి పార్టీ మారుతారని చంద్రబాబు పగటి కలలు కంటున్నారని, కానీ మనది గుండె ధైర్యం ఉన్న పార్టీ అని వ్యాఖ్యానించారు. "పుట్టా మహేష్ లాంటి యువ నేతలపై దాడులు చేయడం బాబు దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ఠ" అని ఆయన పేర్కొన్నారు. కార్యకర్తలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, సూపర్ సిక్స్ హామీల అమలుపై ప్రజల్లోకి వెళ్లి నిలదీయాలని నేతలకు పిలుపునిచ్చారు. త్వరలోనే తాను స్వయంగా జిల్లాల పర్యటనకు వస్తానని, అప్పటివరకు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలపై పోరాడాలని దిశానిర్దేశం చేశారు.

# రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదు..

మొదటి పేజీ తరువాయి

నిల్వలు పుష్కలం.. పంపిణీలో పారదర్శకత

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 14 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నాయని, మరో రెండు రోజుల్లో అదనపు స్టాక్ అందుబాటులోకి రానుందని ముఖ్యమంత్రి వెల్లడించారు.రాబోయే 15 రోజులకు సరిపడా ముందస్తు నిల్వలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్యాస్ సిలిండర్ల పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు ఈకేవైసీ (e-KYC) మరియు ఓటీపీ (OTP) విధానాలను కఠినంగా అమలు చేయాలని, దీనివల్ల సిలిండర్ల డైవర్షన్ ఆగి, అసలైన లబ్ధిదారులకు సకాలంలో గ్యాస్ అందుతుందని ఆయన పేర్కొన్నారు.

అత్యవసర విభాగాలకు ప్రాధాన్యత

"ఆసుపత్రులు, విద్యార్థుల హాస్టళ్లు మరియు దేవాలయాలకు గ్యాస్ సరఫరాలో ఒక్క నిమిషం కూడా అంతరాయం కలగకూడదు" అని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు ఆందోళన చెందకుండా క్షేత్రస్థాయిలో వాస్తవాలను వివరించాలని అధికారులకు సూచించారు. ఒకవేళ అత్యవసర పరిస్థితి తలెత్తితే వినియోగించుకునేలా ఇండక్షన్ స్టవ్స్ స్టాక్‌ను రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉంచాలని వాణిజ్య పన్నుల శాఖను ఆదేశించారు.

కేజీ బేసిన్ గ్యాస్.. పైపుల ద్వారా ఇంటింటికీ

రాష్ట్రంలో గ్యాస్ వినియోగంలో దీర్ఘకాలిక మార్పులు రావాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ తీరంలోని కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును పైప్డ్ నేచురల్ గ్యాస్ (PNG) నెట్వర్క్ ద్వారా నేరుగా ప్రజల ఇళ్లకు సరఫరా చేసే దిశగా అడుగులు వేయాలని అధికారులకు సూచించారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (CGD) నెట్వర్క్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడం ద్వారా సిలిండర్ల అవసరం తగ్గి, తక్కువ ఖర్చుతో స్వచ్ఛమైన ఇంధనం అందుబాటులోకి వస్తుందని ఆయన వివరించారు.

స్వల్పకాలిక మరియు దీర్ఘకాలిక వ్యూహాలు

గ్యాస్ కంపెనీలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవాలని, పంపిణీ వ్యవస్థను మరింత మెరుగుపరచాలని ముఖ్యమంత్రి కోరారు. సీఎన్జీ (CNG) మరియు పీఎన్జీల వినియోగాన్ని గరిష్ట స్థాయికి తీసుకెళ్లడం ద్వారా పెట్రోలియం దిగుమతులపై భారం తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలకు తక్షణమే అందుబాటులోకి వచ్చే ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై నిరంతరం అధ్యయనం చేయాలని ఐటీ మరియు ఇంధన శాఖ అధికారులను ఆదేశించారు.

# రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే మన ఏకైక లక్ష్యం

మొదటి పేజీ తరువాయి



అనంతరం ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. కార్యాలయం మొత్తం కలియతిరిగారు. ఈ సందర్భంగా ఏపీఈడీబీ ఉద్యోగులకు దిశానిర్దేశం చేస్తూ.. గత ప్రభుత్వం ఏపీఈడీబీని నిర్లక్ష్యం చేసింది. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే మన ఏకైక లక్ష్యం కావాలి. ఒప్పందాలు కాకుండా పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా కృషి చేయాలి. యువగళం పాదయాత్ర సమయంలో యువతకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాను. జీడీ నెల్లూరులో పాదయాత్ర చేస్తున్న సమయంలో రోడ్డు పక్కన బజ్జీలు విక్రయించే మోహన అనే మహిళను కలిశాను. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం వద్దని, తమ పిల్లలకు ఉద్యోగాలు కల్పిస్తే చాలని ఆమె చెప్పారు. కూటమి ప్రభుత్వం 20 నెలల కాలంలోనే పెద్దఎత్తున పెట్టుబడులు సాధించాం. దేశానికి వచ్చిన వంద రూపాయల పెట్టుబడుల్లో 25 రూపాయాలు ఏపీకి వచ్చాయి. ఇందుకు ఈడీబీ బృందానికి అభినందనలు. సీఈవో సాయికాంత్ వర్మకు నా హృదయపూర్వక అభినందనలు.

ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీని ఎంచుకున్నాయి

గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీని ఎంచుకున్నాయి. ఇప్పుడు మనం మరింత స్పీడ్ పెంచాల్సిన అవసరం ఉంది. ఎన్ని ఉద్యోగాలు కల్పించామన్నదే ముఖ్యం. రిలయన్స్ సీబీజీ ప్రాజెక్ట్ వల్ల పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తున్నాయి. ఇది ప్రారంభం మాత్రమే. ఉద్యోగాల కల్పనే మన సింగిల్ ఎజెండాగా ఉండాలి. నూతన పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రాజెక్టుల గ్రౌండింగ్ మన ప్రధాన లక్ష్యం కావాలి. ఛాలెంజ్ గా తీసుకోవాలి. మన ఏకైక లక్ష్యం 20 లక్షల ఉద్యోగాల కల్పన అని ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకోవాలి. మీ అందరూ మీకు కేటాయించిన క్లస్టర్‌లో నిపుణులుగా మారాలి. ఇప్పటికే సుమారు 22 క్లస్టర్లను గుర్తించాం. వర్టికల్ ఇంటిగ్రేషన్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్ పై దృష్టి సారించాలి. ఒప్పందం కుదుర్చుకున్న ప్రతి ప్రాజెక్ట్ గ్రౌండ్ కావాలి. ప్రతి ప్రాజెక్ట్ ను సమీక్షించడం జరుగుతుంది. ఏ ప్రాజెక్ట్ ఇతర రాష్ట్రాలకు వెళ్లకూడదు. అధికారులు, సిబ్బంది ఉన్నతంగా ఆలోచించాలి. ఈ నెల 23 రెండో స్టీల్ సిటీకి శంకుస్థాపన చేస్తున్నాం. ఇంతటితో తృప్తిపడకూడదు. ఎందుకు ఐదు స్టీల్ సిటీలు నిర్మించకూడదు? అమరావతి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏప్రిల్ చివరినాటికి ఉండవల్లి నుంచి సీడ్ యాక్సిస్ రోడ్ అందుబాటులోకి వస్తుంది. ప్రతిఒక్కరం ఎంతో కష్టపడుతున్నాం. దేశం, రాష్ట్రం, ఈడీబీ గర్వపడే విధంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని ఈ సందర్భంగా మంత్రి దిశానిర్దేశం చేశారు.

# బ్యాంకుల 'పెనాల్టీ' గుట్టు విప్పిన రాఘవ్ చద్దా..

## రూ.19 వేల కోట్ల వసూళ్లపై సంచలనం



పార్లమెంట్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా బ్యాంకులపై సంచలన ఆరోపణలు చేశారు. గత మూడేళ్లలో మినిమమ్ బ్యాలెన్స్ పేరుతో బ్యాంకులు రూ. 19,000 కోట్లు పెనాల్టీలుగా వసూలు చేశాయని వెల్లడించారు.

ఈ డబ్బు బడా వ్యాపారుల నుంచి కాకుండా రైతులు, పెన్షనర్లు, మధ్యతరగతి ప్రజల నుంచి వసూలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ బ్యాంకులు సుమారు రూ. 11,000 కోట్లు, ప్రభుత్వ బ్యాంకులు రూ. 8,000 కోట్లు వసూలు చేశాయని తెలిపారు.మినిమమ్ బ్యాలెన్స్ పెనాల్టీలను "పేదలపై పన్ను"గా అభివర్ణిస్తూ, వెంటనే ఈ జరిమానాలను రద్దు చేయాలని ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను డిమాండ్ చేశారు.ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, సామాన్యుల సమస్యలను ప్రస్తావించినందుకు ఆయనకు మద్దతు వ్యక్తమవుతోంది.

# దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం మరో కానుక

## 'దివ్యాంగ శక్తి' పథకం ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

'స్త్రీశక్తి' బస్సులే 'దివ్యాంగ శక్తి'కి వర్తింపు



ప్రస్తుతం 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు, 100 శాతం కంటి చూపు కోల్పోయిన వాళ్లకు, 100 శాతం మూగ, చెవిటి వారికి, అలాగే 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న మానసిక దివ్యాంగులు మాత్రమే ఏపీఎస్ ఆర్టీసీ సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో వీరికి 50 శాతం రాయితీ లభిస్తోంది. 100 శాతం అంధత్వం, మానసిక వైకల్యం ఉన్నవారితో వచ్చే సహాయకులకు 50 శాతం రాయితీ లభిస్తోంది. అయితే 'దివ్యాంగ శక్తి' పథకం కింద దివ్యాంగులకు పూర్తిగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. 40 శాతం, లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు అందరికీ స్త్రీశక్తి పథకం కింద వర్తించే బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తోంది. అంటే దివ్యాంగులు ఇకపై సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఒక్క రూపాయి కూడా ఛార్జీ లేకుండా రాష్ట్రమంతా ప్రయాణం చేసే వెసులుబాటు లభించింది. అంతేకాదు, వారితో పాటు వచ్చే సహాయకులకు ఈ బస్సుల్లో 50 శాతం రాయితీ లభిస్తుంది.

4 నుంచి 21 వర్గాలకు పథకం విస్తరణ

ఇప్పటివరకు కేవలం 4 వర్గాల దివ్యాంగులకు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండేది. ఇకపై 21 వర్గాల దివ్యాంగులకు ఈ సౌకర్యాన్ని విస్తరించింది. శారీరక–మానసిక దివ్యాంగులు, ఆటిజం, నాడీ సంబంధ వ్యాధులు, పార్కిన్సన్స్, తలసేమియా, హీమోఫిలియా, సికిల్ సెల్ వంటి వ్యాధిగ్రస్తులకు ఈ పథకంతో భరోసా కలుగుతుంది. ప్రస్తుతం 1.71 లక్షల దివ్యాంగులకే లబ్ది చేకూరుతుండగా... పథకం విస్తరణతో ఇకపై 11.16 లక్షల మంది దివ్యాంగులకు ప్రయోజనం కలుగుతుంది. వీరిలో పురుషులు 6.86 లక్షల మంది ఉన్నారు. అలాగే ఇప్పటివరకు 33,800 మంది సహాయకులకే రాయితీ లభిస్తుండగా... ఇకపై 1.60 లక్షల మంది సహాయకులకు 50 శాతం రాయితీ లభించనుంది. దీంతో ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందే మొత్తం లబ్దిదారుల సంఖ్య 2.05 లక్షల నుంచి 12.76 లక్షలకు పెరిగనుంది.

7,264 బస్సుల్లో ఉచిత ప్రయాణం

ఈరోజు నుంచి స్త్రీ శక్తి పథకం వర్తించే 7,264 బస్సుల్లో దివ్యాంగులు కూడా ఉచితంగా ప్రయాణించవచ్చు. ఏపీఎస్ ఆర్టీసీలో సుమారు 73 శాతం బస్సులకు ఈ పథకాన్ని వర్తింప చేశారు. ఇప్పటికే దివ్యాంగులు, వారి సహాయకులకు 3 సంవత్సరాల కాలానికి ఇచ్చిన పాసులు ఈ కొత్త పథకం ద్వారా ఉచిత ప్రయాణం చేసేందుకు ఉపయోగపడతాయి. ఉచిత ప్రయాణానికి అవసరమైన డిజిటల్ పాస్‌లు మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ యాప్, ఏపీఎస్ ఆర్టీసీ యాప్ ద్వారా పొందవచ్చు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్లలోని 134 కౌంటర్లలో దివ్యాంగులకు సేవలు అందుతాయి. ఈ యాప్స్‌ను సదరం యాప్‌తో అనుసంధానించినందున ఫిజికల్ సర్టిఫికేట్ చూపించాల్సిన అవసరం లేదు. క్యూఆర్ కోడ్‌తో ఉచిత డిజిటల్ పాస్‌లు జారీ చేస్తారు.

# వడ్డీ లేని రుణాలపై సవాళ్ల పర్వం..

## రాజీనామాకు సిద్ధమని కేటీఆర్ సవాల్

మొదటి పేజీ తరువాయి




"ఈ ప్రభుత్వం తీరు 'ఎగ్గొట్టు.. కూలగొట్టు.. చెడగొట్టు' అన్నట్లుగా ఉంది. ఇచ్చిన హామీలను ఎగ్గొట్టడం, కట్టిన ప్రాజెక్టులను కూలగొట్టడం, ఉన్న పథకాలను చెడగొట్టడమే ఈ రెండేళ్ల పాలన" అని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి, పెన్షన్ల పెంపు వంటి అంశాల్లో ప్రజలను వంచించారని కేటీఆర్ ఆరోపించారు.

అప్పుల గురించి మీరా మాట్లాడేది?: భట్టి, కోమటిరెడ్డి ఆగ్రహం

కేటీఆర్ వ్యాఖ్యలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గట్టిగా కౌంటర్ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని, తాము ఆ అప్పులకు వడ్డీలు కడుతూనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. "మీలాగా మేము దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని మోసం చేయలేదు.. రైతు భరోసా, సన్నబియ్యం బోనస్, ఉచిత విద్యుత్ వంటి పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నాం" అని భట్టి వివరించారు. మరోవైపు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. "రేషన్ కార్డులు ఇచ్చినందుకు, ఉచిత బస్సు ప్రయాణం కల్పించినందుకు, ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నందుకు ఈ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పాలి" అని హితవు పలికారు.

రాజీనామా సవాల్‌తో సభలో రగడ

మహిళా సంఘాలకు రూ. 57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామన్న గవర్నర్ ప్రసంగంలోని అంశంపై సభలో సవాళ్ల పర్వం నడిచింది. ఇది పచ్చి అబద్ధమని, నిరూపిస్తే తాను తన పదవికి రాజీనామా చేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు. దీనిపై మంత్రి సీతక్క స్పందిస్తూ.. ఇప్పటికే మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందాయని, లెక్కలు చూసుకునే ధైర్యం కేటీఆర్‌కు ఉందా అని ప్రశ్నించారు. గోబెల్స్ ప్రచారంలో బీఆర్ఎస్ నేతలను మించిన వారు ప్రపంచంలోనే లేరని మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై కూడా కేటీఆర్ మరియు స్పీకర్ మధ్య వాడివేడి చర్చ జరిగింది.

# కొల్లూరు భూముల వ్యవహారం

## ప్లాట్ యజమానుల ఐక్యతతో న్యాయ హక్కుల సాధనకు కొత్త దిశ




కొల్లూరు భూముల అంశం మరోసారి చర్చనీయాంశంగా మారుతోంది. చాలా కాలంగా కొనసాగుతున్న ఈ వివాదంలో ఇప్పుడు ప్లాట్ యజమానులు ఐక్యంగా ముందుకు రావడం కీలక పరిణామంగా భావిస్తున్నారు. ఇటీవల జరిగిన సమావేశంలో కొత్త ప్లాట్ యజమానులు సమిష్టిగా సమావేశమై తమ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. న్యాయబద్ధమైన హక్కులను సాధించుకోవడానికి ఇకపై ఒక్కటిగా పోరాటం కొనసాగించాలని వారు నిర్ణయించారు. ముఖ్యంగా మెసారా ఇన్‌ఫ్రా గ్రూప్‌తో కలిసి ముందుకు సాగాలని ఏకగ్రీవంగా తీర్మానించడం ఈ సమావేశంలో ప్రధానంగా వెలువడిన అంశంగా నిలిచింది.

### 1984లో ప్లాట్లుగా విభజన

కొల్లూరు ప్రాంతంలోని ఈ భూముల చరిత్రను పరిశీలిస్తే, 1984 సంవత్సరంలో ఈ భూములను చట్టబద్ధంగా ప్లాట్లుగా విభజించినట్లు ప్లాట్ యజమానులు చెబుతున్నారు. అప్పటి నిబంధనలకు అనుగుణంగా భూములను చిన్న చిన్న ప్లాట్లుగా విభజించి కొనుగోలు, విక్రయాలు జరిగాయి. అనేక కుటుంబాలు తమ జీవిత పొదుపులతో ఈ ప్లాట్లను కొనుగోలు చేసాయి. కొందరు అక్కడ నివాసాల నిర్మాణం చేయాలని భావించగా, మరికొందరు భవిష్యత్ అవసరాల కోసం పెట్టుబడిగా ఈ స్థలాలను తీసుకున్నారు.

ఈ లావాదేవీలు చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ల ద్వారా జరిగాయని ప్లాట్ యజమానులు చెబుతున్నారు. అప్పటి నుంచి పలుమార్లు ఈ ప్లాట్లు చేతులు మారినా కూడా రిజిస్ట్రేషన్ ప్రక్రియల ద్వారా చట్టబద్ధంగా కొనుగోళ్లు కొనసాగినట్లు వారు పేర్కొంటున్నారు. అంటే మొదటి విభజన నుంచే ఈ భూములపై జరిగిన లావాదేవీలు చట్టబద్ధమైనవే అన్నది వారి వాదన.

### 2002లో అవుటర్ రింగ్ రోడ్ ప్రతిపాదన -- పరిస్థితుల మార్పు

2002 ప్రాంతంలో అవుటర్ రింగ్ రోడ్ ప్రతిపాదన వెలువడిన తరువాత ఈ ప్రాంతానికి అకస్మాత్తుగా ప్రాధాన్యం పెరిగింది. భవిష్యత్‌లో నగర అభివృద్ధికి కీలకంగా మారే ప్రాంతంగా కొల్లూరు గుర్తింపు పొందింది. దీంతో పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ ఆసక్తులు పెరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.

ఈ పరిణామాల తరువాత కొంతమంది ప్రభావశీలులు రంగప్రవేశం చేసినట్లు ఆరోపణలు వినిపించాయి. ఇప్పటికే ప్లాట్లుగా విభజించి విక్రయించిన భూములను తిరిగి ఎకరాలుగా చూపిస్తూ కొత్త లావాదేవీలు జరిపినట్లు ప్లాట్ యజమానులు ఆరోపిస్తున్నారు. చిన్న చిన్న ప్లాట్లుగా ఉన్న భూములను మొత్తం భూభాగంగా చూపిస్తూ ఎకరాల లెక్కలో లావాదేవీలు జరిగాయని వారు చెబుతున్నారు.

దీంతో అసలు ప్లాట్ యజమానుల హక్కులు ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితి ఏర్పడింది. చాలామంది ప్లాట్ యజమానులు తమ హక్కులను రుజువు చేసుకోవడానికి న్యాయపోరాటం ప్రారంభించారు.

### లోకాయుక్త తీర్పు -- ప్లాట్ యజమానులకు బలం

ఈ వ్యవహారం వివిధ స్థాయిల్లో విచారణకు వెళ్లిన తర్వాత లోకాయుక్త దృష్టికి కూడా వెళ్లింది. విచారణ అనంతరం వచ్చిన తీర్పులో ప్లాట్ యజమానుల వాదనకు చట్టబద్ధత ఉందని పేర్కొన్నట్లు వారు చెబుతున్నారు. 1984లో జరిగిన ప్లాట్ల విభజన మరియు ఆ తరువాత జరిగిన చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ లావాదేవీలను గుర్తించాలని సూచనలు వెలువడినట్లు ప్లాట్ యజమానుల వర్గాలు చెబుతున్నాయి.

ఈ తీర్పు ప్లాట్ యజమానులకు పెద్ద ఊరట కలిగించిన అంశంగా భావిస్తున్నారు. తమ హక్కులు చట్టబద్ధమైనవే అన్న నమ్మకం మరింత బలపడిందని వారు పేర్కొంటున్నారు.

### ప్లాట్ యజమానుల ఐక్యత -- మెసారా గ్రూప్‌తో ముందడుగు

ఈ నేపథ్యంలో ఇటీవల ప్లాట్ యజమానులు సమావేశమై ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నారు. ఇకపై విడివిడిగా కాకుండా సమిష్టిగా ముందుకు సాగాలని నిర్ణయించారు. తమ హక్కుల కోసం ఒకే వేదికపై పోరాటం కొనసాగించాలని వారు సంకల్పించారు.

ఈ పోరాటంలో మెసారా ఇన్‌ఫ్రా గ్రూప్‌తో కలిసి పనిచేయాలని వారు నిర్ణయించారు. మెసారా ఇన్‌ఫ్రా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ మారెళ్ల పెంచల సుబ్బారెడ్డి నాయకత్వంపై ప్లాట్ యజమానులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఆయన చట్టబద్ధమైన మార్గాల్లో తమకు న్యాయం సాధించడంలో సహకరిస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సమావేశంలో పలువురు ప్లాట్ యజమానులు మాట్లాడుతూ, తమ ప్లాట్లు చట్టబద్ధంగా కొనుగోలు చేసినవేనని, వాటిపై తమకు సంపూర్ణ హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ హక్కులను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

### న్యాయ హక్కుల సాధనపై ఆశలు

మొత్తం మీద కొల్లూరు భూముల వ్యవహారం మరో కీలక దశకు చేరుకున్నట్లు కనిపిస్తోంది. ప్లాట్ యజమానుల ఐక్యత, లోకాయుక్త తీర్పు ద్వారా వచ్చిన న్యాయబద్ధత, మెసారా గ్రూప్ మద్దతు వంటి అంశాలు కలిసివచ్చి సమస్య పరిష్కారానికి మార్గం సుగమం చేస్తాయని బాధితులు ఆశిస్తున్నారు.

సమిష్టి కృషితో తమ హక్కులను సాధించుకుంటామని ప్లాట్ యజమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కొల్లూరు అంశం త్వరలోనే న్యాయబద్ధ పరిష్కారానికి దారి తీస్తుందనే ఆశలు ఇప్పుడు మళ్లీ బలపడుతున్నాయి.

---



## ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్య వ్యాఖ్య.. సెక్యూరిటీ గార్డు అరెస్ట్!

సైబరాబాద్, మార్చి 17: (బిఎన్ఎస్ ): సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు పోస్టు చేసిన వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రముఖ నటి రేణు దేశాయ్‌పై అభ్యంతరకర వ్యాఖ్య చేసిన కేసును విచారించి నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోటిపల్లి వెంకన్న అనే వ్యక్తి సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఖాళీ సమయాల్లో ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ వీక్షించే అలవాటు ఉన్న అతను, ఇటీవల సాక్షి న్యూస్ పేజీలో వచ్చిన నటి రేణు దేశాయ్ రీల్‌ను చూసి తన ఖాతా ద్వారా అసభ్యకర, దూషణాత్మక వ్యాఖ్య చేశాడు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సైబర్ క్రైమ్ పోలీసులు, మాధాపూర్‌లో ఉన్న నిందితుడిని గుర్తించి మార్చి 17న అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గచ్చిబౌలిలోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ జరిపారు. తన వద్ద ఉన్న వివో మొబైల్ ఫోన్ ద్వారా ఆ వ్యాఖ్య పోస్టు చేసినట్లు నిర్ధారించారు.

జాగ్రత్తలు అవసరం: సోషల్ మీడియా వినియోగదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు. అసభ్య, దూషణాత్మక వ్యాఖ్యలు చేయడం చట్టపరమైన చర్యలకు దారి తీస్తుందని హెచ్చరించారు. ఏదైనా సైబర్ నేరం గమనించినట్లయితే సమీప సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలనీ లేదా 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

---

## బిసి హాస్టల్ స్థలం కబ్జాల ముప్పులో... పరిరక్షణకు విజ్ఞప్తి



శేరిలింగంపల్లి :(బిఎన్ఎస్): గోపినగర్‌లోని శేరిలింగంపల్లి మండల బిసి బాలుర వసతి గృహం స్థలం కబ్జాల ముప్పులో ఉందని గోపినగర్, బాపునగర్, నెహ్రూనగర్ సంక్షేమ సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు సంబంధిత అధికారులకు వినతి పత్రాలు సమర్పించి, స్థలాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు.

డిప్యూటీ కలెక్టర్, శేరిలింగంపల్లి తహసిల్దార్ మహిపాల్ రెడ్డి, జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే, రంగారెడ్డి జిల్లా బిసి డెవలప్మెంట్ అధికారి (డిప్యూటీ డైరెక్టర్) కేశురాం, కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌లకు సంఘం ప్రతినిధులు విజ్ఞప్తులు అందజేశారు.

వసతి గృహం ఏర్పడి దశాబ్దాలు గడిచినా ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రక్షణ లేకపోవడంతో ప్రాంగణం క్రమంగా కబ్జాలకు గురవుతోందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి హాస్టల్ స్థలాన్ని పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపినగర్, బాపునగర్, నెహ్రూనగర్ ప్రాంతాల నివాసులు పాల్గొన్నారు.

---

## ముషీరాబాద్‌లో 610 కిలోల కుళ్లిన చికెన్ పట్టివేత



హైదరాబాద్: ముషీరాబాద్ బాపూజీ నగర్‌లోని ఏ -1 ఫ్రెష్ చికెన్ మార్ట్‌పై వారాసిగూడ పోలీసులు దాడి చేసి, సుమారు 610 కిలోల కుళ్లిపోయిన మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమాని షేక్ షకీల్ పాడైన చికెన్‌ను విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మాంసం దుర్వాసన రావడంతోపాటు, ఎలుకలు, పిల్లులు సంచరించే అత్యంత అపరిశుభ్ర ప్రాంతంలో నిల్వ ఉంచినట్లు గుర్తించారు. మరోవైపు షాపు ట్రేడింగ్ లైసెన్స్ గడువు ముగిసి ఏడాది దాటినా రెన్యువల్ చేయించుకోకుండా.. అక్రమంగా కొనసాగిస్తున్నట్లు తేలింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు తదుపరి చర్యలు చేపట్టారు.

---

## రూ.కోటి దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు



కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న భారీ దారి దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. చోరీకి గురైన రూ.కోటిలో రూ.77 లక్షలకుపైగా రికవరీ చేశారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. శంషాబాద్ వద్ద వారిని పట్టుకున్నారు. బహదూర్‌పురాకు చెందిన కుస్రు, అజీముద్దీన్ డబ్బుతో వెళ్తుండగా నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌లపై వచ్చి కళ్లలో కారం చల్లి.. రూ.కోటి నగదును దోచుకెళ్లారు.

---

## వెలుగు కార్యాలయం నందు మహిళా చట్టలపై అవగాహన




నెల్లూరు జిల్లా కలువాయి, మార్చి 17(బిఎన్ఎస్): అంతర్జాతీయ మహిళల దినోత్సవంలో భాగంగా నెల్లూరు జిల్లా కలువాయి లోని వెలుగు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు రాపూరు ఐసీడీఎస్ సీడీపీఓ సునంద ఆధ్వర్యంలో మహిళల భద్రత, పోక్సో యాక్ట్, పొష్ చట్టం, బాల్య వివాహాల నిర్ములన , సైబర్ క్రైమ్, ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి సఖీ వన్ స్టాఫ్ అడ్మిన్ షహనాజ్, సమత, డాక్టర్ విజయలక్ష్మి, కౌన్సిలర్ శారద హాజరయ్యారు..

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, మహిళలపై జరిగే వేధింపులు, గృహహింస, లైంగిక దాడులపై చట్టాలు కఠినంగా ఉన్నాయని, బాధితులు భయపడకుండా ఫిర్యాదు చేయాలని సూచించారు.. అదేవిధంగా సైబర్ క్రైమ్ విషయంలో సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, వ్యక్తిగత వివరాలు ఎవరికీ పంచుకోకూడదని అవగాహన కల్పించారు, ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్ల గురించి వివరించి ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే అధికారులను సంప్రదించాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో మహిళలు, ఏఎన్ఎంలు, అంగన్వాడిలు,ఆశా వర్కర్లు, పాల్గొన్నారు

---

## 'నేను పార్టీ వీడతానని చెప్పానా?'.. సంజయ్‌పై జీవన్ రెడ్డి ఫైర్




సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనతో కలిసి పనిచేయాలని సంజయ్ ఆఫర్ ఇచ్చారని, కానీ ఆయన ఏ పార్టీలో ఉన్నారో స్పష్టత లేకుండానే ఇలా మాట్లాడటం సరైందా అని ప్రశ్నించారు.

తాను పార్టీ వీడతానని ఎప్పుడూ చెప్పలేదని స్పష్టం చేసిన జీవన్ రెడ్డి, తమ పార్టీలోకి వచ్చి విభేదాలు సృష్టించింది సంజయేనని ఆరోపించారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుబంధాన్ని విడిచిపెట్టడం సులభం కాదని, పరిస్థితులు అలా చేస్తే తప్ప మరో మార్గం ఉండదన్నారు.

ప్రస్తుతం తాను కాంగ్రెస్‌లోనే ఉన్నానని చెప్పిన ఆయన, పార్టీ పరిస్థితులు మారకపోతే నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అభివృద్ధి పనులు, హామీల అమలుపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు.

# చింతలు తీర్చే అమ్మ.. చింతలూరు నూకాలమ్మ

## నేడే జాతర మహోత్సవం
## నెల రోజుల పాటు జరిగే తీర్ద మహోత్సవం



ఆలమూరు (బిఎన్ఎస్) మార్చి.17 మంగళవారం..ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ప్రసిద్ధి చెందిన కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరు శ్రీ నూకంబికా అమ్మవారి జాతర మహోత్సవం ఈనెల 17 మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే 18న తీర్ధ మహోత్సవం, 19న ఉగాది ఉత్సవాలు ఈ ఆలయం వద్ద కన్నులపండువగా జరగనున్నాయి.చంటి పిల్లలకు వచ్చే పొంగు, ఆటలమ్మ వంటి వ్యాధులు దరిచేరకుండా ఈ అమ్మవారు అనుగ్రహిస్తారని భక్తుల విశ్వాసం. అందుకనే ఈ అమ్మవారి దర్శనానికి చంటి పిల్లలతో తల్లిదండ్రులు అధిక సంఖ్యలో ఇక్కడకు తరలి వస్తారు.చంటి పిల్లలతో ఇంత అధిక సంఖ్యలో ఉత్సవాలకు రావడం గోదావరి జిల్లాలలోనే కాదు కోస్తా జిల్లాలలో ఎక్కడా మరో ఆలయం ఉండదనే చెప్పాలి.నెల రోజుల పాటు ఈ అమ్మవారి తీర్ధమహోత్సం జరుగుతుంది. అమ్మవారిని దర్శించుకుని కానుకలు మొక్కుబడలు తీర్చుకోవడమే గాక వారపోత, తుల్లిబిళ్ళ, కావిడి కోళ్లు, గండా దీపం వంటివి ఈ ఆలయంలో భక్తులు ప్రత్యేకంగా చేయడం ఎన్నో దశాబ్దాలుగా వస్తున్న ఆచారం.

జాతర్లకే జాతర చింతలూరు నూకాలమ్మ జాతర

గ్రామదేవతలకు జాతర నిర్వహించడం మనకు తెలిసిందే.కాని చింతలూరు నూకాలమ్మ జాతర అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతుంటారు.తెల్లవార్లూ శరీరం గగుర్పాటు కల్పించే రీతిలో వేలాదిమంది భక్తులు సమక్షంలో, బాణాసంచా కాల్పులు, కళ్లు చెదిరే విద్యుత్ అలంకరణ మధ్య కొనసాగే ఈ జాతరను చూడడానికి రెండు కళ్ళు చాలవంటే అతిశయోక్తి కాదు. అంత రంగ రంగ వైభవంగా జాతర జరుగుతుంది. ఆ మన్నాడు తీర్ధ మహోత్సవం కూడా మామూలుగా ఉండదు. పెద్ద ఎత్తున భక్తులు తీర్ధ మహోత్సవంలో పాల్గొంటారు. ఇక ఉగాది ఉత్సవాలు ఇక్కడ చాలా ప్రత్యేకతను సంతరించుకుంటాయి. ఎందుకంటే ఆ రోజున అందరూ ఉగాది వేడుకలు తమ ఇంటి వద్ద జరుపుకుంటారు. కాని చింతలూరు పరిసర ప్రాంతాల ప్రజలంతా ఈ ఆలయం వద్దే ఉగాది సందడి చేసుకుంటారు. దూర ప్రాంతాల్లో ఉద్యోగ,వ్యాపార రీత్యా స్థిరపడిన వారంతా సంక్రాంతికి వచ్చినా రాకపోయినా ఈ ఉగాదినాడు కచ్చితంగా వచ్చి బంధుమిత్రులు తో ఎంతో ఆనందంగా గడుపుతారు. అందుకనే ఈ ప్రాంతంలో ఉగాదికి అంత స్పెషల్ ఉంటుంది. ఆలమూరు మండలం తో పాటు మండపేట, కపిలేశ్వరపురం, రావులపాలెం, కడియం మండలాల ప్రజలు ఈ అమ్మవారిని ఆరాధ్య దైవంగా కొలుస్తూ వస్తున్నారు. ఇంటిల్లపాది ఈ అమ్మవారి దర్శనానికి తరలి వస్తారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం రావులపాలెం, రామచంద్రపురం ఆర్టీసీ డిపోల వారు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసారు. ఆర్టీసీ బస్సులు అంతగా లేని రోజుల్లో ప్రైవేటు సిటీ బస్సులను ప్రత్యేకంగా ఏ ప్రాంతాలకు తిప్పేవారు. ఆ సిటీ బస్సులు కూడా లేని రోజుల్లో ఎడ్లబళ్ళు, గుర్రం బండ్లు, రిక్షాలు, సైకిళ్లపై చింతలూరు అమ్మవారి ఆలయానికి తరలివచ్చేవారు.అలా వచ్చి ఇలా వెళ్లిపోకుండా ఇక్కడే వంట వార్పులతో రెండు మూడు రోజులు ఉండి వెళ్లేవారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ఈ అమ్మవారు ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లన్ని పూర్తి అయ్యాయి. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో పలు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న ఈ అమ్మవారి ఉత్సవాలకు ప్రతిష్టమైన ఏర్పాట్లు చేశారు.ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వీరి అప్పారావు,ఇవో ఉండవల్లి వీర్రాజు చౌదరిల సారధ్యంలో ఉత్సవాలు విజయవంతంగా జరగడానికి చర్యలు చేపట్టారు. ముఖ్యంగా ఆలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది నెల రోజులు పాటు వేలంపాటలు నిర్వహించగా ఆలయానికి సుమారు రూ.70 లక్షలు ఆదాయం సమకూరింది. గతంలో కొన్ని రోజులకు మాత్రమే పాటలు నిర్వహించడం వల్ల ఆదాయం స్వల్పంగా ఉండేది. అలాగే ఈసారి దళారుల బెడద లేకుండా ప్రతిష్టమైన ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు దళారుల బెడద ఉంటుందని ఎప్పటినుంచో అపనింద ఉంది. కాని అటువంటి దళారులను ఈ ఏడాది కట్టుదిట్ట చేయడంలో పాలకవర్గం, గ్రామ పెద్దలు, అధికార యంత్రాంగం విజయం సాధించించారని చెప్పాలి. ఈ అమ్మవారి మహత్యం ఏమిటంటే ఆలయం సొమ్మును కక్కుర్తి పడితే వారు గుడి చుట్టూనే తిరుగుతారు తప్ప ఎక్కడా ఎదుగూబొదుగు ఉండదు.ఇది అమ్మవారి శాపంగా పేర్కొంటారు.అలాగే ఈ ఏడాది తుళ్లు బిళ్ళ, ఓరకల్ల వంటి వాటివద్ద కూడా దేవస్థానం నిర్ణయిన ధరలు మాత్రమే తీసుకునే విధంగా బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఎవరైనా ఎక్కువ వసూళ్లు చేస్తే తగిన చర్యలు తీసుకునే విధంగా దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు.

# డ్రైనేజీ సమస్యలను పరిశీలించిన యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్



అల్విన్ కాలనీ, 17 మార్చి (బిఎన్ఎస్): డివిజన్ ఎన్.టి.ఆర్ నగర్ కాలనీలో రెండు వీధులలో డ్రైనేజీ లైన్ జామ్ అయ్యి సమస్యగా ఉందని కాలనీ ప్రజల సమాచారంతో, శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ మరియు డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆదేశాలమేరకు యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ కాలనీలో పర్యటించి ఎయిర్ టెక్ యంత్రంతో మరియు వాటర్ వర్క్స్ సిబ్బందితో డ్రైనేజీ లైన్ ను దగ్గరుండి క్లియర్ చేయించి సమస్యను పరిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లేష్, ఖాజా, సూపర్వైజర్ శివ, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి



కుత్బుల్లాపూర్ , 17 మార్చి (బిఎన్ఎస్): సూరారం కాలనీ లూయిస్ బ్రెయిలీ భవన్ లో నిర్వహించినటువంటి అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అదేవిధంగా పురుషులతో పాటుగా అన్ని విభాగాల్లో సమానంగా పోటీపడుతూ భావితరాలకు ఆదర్శంగా నిలవాలని కొనియాడారు అదేవిధంగా ఆడపడుచులకు సన్మానించి కేక్ కట్ చేసుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, టిఎల్ఎఫ్ సెక్రటరీ ఆసియా, ఎస్ ఎల్ ఎఫ్ ప్రెసిడెంట్ సత్యవాణి, పద్మ జ్యోతి, సుకన్య, వినోద, సమైక్య సంఘాల గ్రూప్ సభ్యులు ఆర్పీ సంఘ సభ్యులు మహిళలు పలు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు


# పంచ సూత్రాలతో వ్యవసాయం పండగ...!!



కొత్తపేట(బిఎన్ఎస్ ) మార్చి 17 : పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలను మూడు దఫాలుగా రైతుల ఖాతాల్లో జమ చేసామని,రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, పంచ సూత్రాలతో వ్యవసాయం పండగలా మారుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. కొత్తపేట మండలం పలివెల సేరిపాలెంలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతన్నా మీకోసం కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యిందన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో పంచ సూత్రాలతో రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నామని తెలిపారు. నీటి భద్రత కింద ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో పోలవరం వెలిగొండ తదితర ప్రాజెక్టులు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అగ్రిటెక్ లో భాగంగా ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రోన్లు మొదలైనవి సబ్సిడీపై అందిస్తుందన్నారు. డిమాండ్ ఆధారిత పంటల సాగుపై రైతులు ఆ అవగాహన పెంచుకోవాలన్నారు.ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, వ్యవసాయధారిత పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తుందని తెలిపారు.

గత వైసీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పేరుతో రైతులను నిలువునా మోసం చేశారన్నారు. ఏడాదికి రూ.7500 మాత్రమే రైతుల ఖాతాలో జమ చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చెప్పింది చెప్పినట్లుగా రూ.20 వేలను పీఎం కిసాన్ పథకంతో కలిపి రైతుల ఖాతాలో జమ చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ధాన్యం సేకరణ నగదు రైతులకు జమ కావడానికి ఆరు నెలల వరకు సమయం పట్టేది అన్నారు. ఇప్పుడు ధాన్యం అమ్మిన వెంటనే 24 గంటల్లో రైతులు ఖాతాలో నగదు జమవుతుందన్నారు. ఈ విధంగా అన్నదాతల అభ్యున్నతికి అవిశ్రాంతంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



ఇనుగుర్తి 18 మార్చి (బిఎన్ఎస్) : జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ లో భాగంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని మందులు లేని ఆహారాన్ని సమాజానికి అందించాలని కోరారు. భవిష్యత్తులో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తుందని తెలిపారు. అనంతరం ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి భాస్కర్ జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్లో భాగంగా వచ్చిన కిట్లను రైతులకు పంపిణీ చేశారు.

# న్యాయం అడిగిన మహిళలపై దాడులు.. డ్రగ్స్ ఎంపీలకు రక్షణ

## ఇదేనా కూటమి పాలన? జగ్గిరెడ్డి ఆగ్రహం

- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు రాజీనామా చేయాలి
- లేకపోతే ప్రజా ఆగ్రహం తప్పదు
- అమలాపురంలో వైఎస్సార్‌సీపీ భారీ నిరసన



అమలాపురం(బిఎన్ఎస్ )మార్చి17 : కోనసీమ జిల్లాలో కూటమి ప్రభుత్వ విధానాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. తిరుపతి పుణ్యక్షేత్రంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు రాజీనామా చేయాలంటూ శాంతియుతంగా నిరసన చేపట్టిన మహిళా నాయకులపై పోలీసులు దాడులు చేసి, తప్పుడు కేసులు పెట్టి అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి అవమానకరమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. అమలాపురం సమీపంలోని ఈదరపల్లి బ్రిడ్జ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ఘాటైన విమర్శలు గుప్పించారు.తిరుమల తిరుపతి వంటి పవిత్రక్షేత్ర గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వివాదాస్పద వ్యవహారాల్లో చిక్కుకోవడం అత్యంత సిగ్గుచేటు అని జగ్గిరెడ్డి విమర్శించారు. మహిళలు శాంతియుతంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినా వారిపై పోలీసులతో దాడులు చేయించడం, తప్పుడు కేసులు నమోదు చేయించడం కూటమి ప్రభుత్వ దుర్మార్గ పాలనకు స్పష్టమైన ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. వెంటనే బీఆర్ నాయుడును పదవి నుంచి తప్పించాలని, లేకపోతే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఇక మరోవైపు హైదరాబాద్ సమీపంలోని మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో ఇటీవల జరిగిన పోలీసుల దాడిలో ఎలూరు ఎంపీ పుట్ట మహేష్ కుమార్ యాదవ్ డ్రగ్స్ వాడినట్టు పరీక్షల్లో తేలిన ఘటనను కూడా జగ్గిరెడ్డి తీవ్రంగా ప్రస్తావించారు. డ్రగ్స్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీలను కాపాడుతూ, మరోవైపు మహిళలపై దాడులు చేయడం కూటమి ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. అధికారంలో ఉన్నవారి తప్పులను కప్పిపుచ్చేందుకు ప్రభుత్వం యత్నిస్తున్నా ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఇటువంటి చర్యలు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకతను మరింత పెంచుతున్నాయని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్, తోట త్రిమూర్తులు, మాజీ ఎంపీ చింతా అనురాధ,పరిశీలకులు జక్కంపూడి విజయలక్ష్మిజాతీయ అవార్డు గ్రహీత,ప్రముఖ పారిశ్రామిక వేత్త డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు,,మహిళాబఅ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై వారు తీవ్రంగా స్పందిస్తూ కూటమి పాలనపై నిప్పులు చెరిగారు.

# నాయకత్వ లక్షణాలు పెంపొందించుకున్నప్పుడే మహిళ సాధికారత సాధ్యం

- చదువుకునే పెళ్లయిన మహిళలకు మెటర్నటి లీవ్స్ మంజూరు
- పార్లమెంట్, అసెంబ్లీలలో ప్రాతినిధ్యం పెరగాలి
- మహిళా కమిషన్ చైర్మన్ రాయపాటి.




అమరావతి, మార్చి 17(బిఎన్ఎస్):మహిళలు నాయకత్వ లక్షణాలు పెంచుకొని స్వతంత్రంగా వ్యవహరించినప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుంది. అమరావతిలోని విట్ విశ్వవిద్యాలయంలో సొసైటీ ఫర్ పబ్లిక్ లా అండ్ గవర్నెన్స్ విట్ ఏపీ–స్కూల్ ఆఫ్ లా వారు నిర్వహించిన Barriers & Building Futures Women in Leadership in the Contemporary World అనే కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ................ గతంతో పోల్చుకుంటే మహిళలు, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో ముందుకు సాగుతున్నారని ఇంకా మరింత ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించడం ఇంటి నుండే మొదలు కావాలన్నారు. ఆడ,మగ అనే తేడా లేకుండా సమానంగా చూసే సంస్కృతి పెంపొందించాలన్నారు. స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్ అమలవుతున్నప్పటికీ పదవుల్లో ఆడవారు ఉన్న పెత్తనం మాత్రం మగవారి చేతిలో సాగుతుందని ఈ విధానానికి స్వస్తి పలికి మహిళల స్వతంత్రంగా వ్యవహరించాలన్నారు. చదువుకునే మహిళలకు వివాహమైనప్పుడు వారి విద్యకు ఆటంకం కలగకుండా కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో మెటర్నటీ లివ్స్ ను మంజూరు చేయాలన్నారు. పార్లమెంట్, అసెంబ్లీలలో మహిళల ప్రాతినిధ్యం పెరగాలని చట్టాలు చేసే చట్టసభల్లో కీలక భూమిక పోషించాలన్నారు. మహిళల రక్షణ, సంరక్షణ ఏ ఒక్కరి బాధ్యత కాదని అది సమాజం మొత్తం సమిష్టి బాధ్యతన్నారు. సమాజంలో ఉన్న రుగ్మతలైన బాల్యవివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీలు, సోషల్ మీడియా మిస్ లీడ్స్ వంటి అంశాలకు వ్యతిరేకంగా మహిళా కమిషన్ పనిచేస్తుందని సమాజం కూడా వీటికి వ్యతిరేకంగా పని చేయాలని పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అనేది అత్యంత కీలకమైనది.మహిళలు కుటుంబానికి మాత్రమే కాదు, సమాజానికి మరియు దేశ నిర్మాణానికి కూడా బలమైన పునాదులుగా నిలుస్తారన్నారు.ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ మహిళల హక్కులను కాపాడేందుకు, వారికి న్యాయం అందించేందుకు, భద్రతను పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తోంది. మహిళల సమస్యలను పరిష్కరించడం మాత్రమే కాకుండా వారికి అవగాహన కల్పించడం కూడా మా ముఖ్య బాధ్యతగా వ్యవహరిస్తున్నామని రాయపాటి శైలజ అన్నారు.

# గిరిజన అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి

## - అల్లూరి జిల్లా గిరిజన సమస్యలను వివరించిన రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్



అమరావతి: అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలు, గిరిజన సంక్షేమం, గిరిజన సహకార సంస్థ (జీసీసీ) బలోపేతం మరియు అభివృద్ధికి సంబంధించిన అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అమరావతి సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కొరత, రహదారులు, తాగునీరు, వైద్యసేవలు, విద్యా సౌకర్యాల లోపం వంటి సమస్యలను ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే గిరిజన రైతులు పంటలకు సరైన ధరలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలియజేసి, వారికి సరైన మద్దతు ధరలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గిరిజన మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడం, స్వయం ఉపాధి అవకాశాలు పెంచడం, అటవీ ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం అత్యవసరమని కిడారి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. జీసీసీ ద్వారా గిరిజనులకు స్థిరమైన ఆదాయం వచ్చేలా కొత్త పథకాలు తీసుకురావాలని, కొనుగోలు కేంద్రాలను విస్తరించి మధ్యవర్తుల సమస్యను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.

గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేసినట్లు కిడారి శ్రావణ్ కుమార్ తెలిపారు. గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇప్పటికే అమలులో ఉన్న పథకాలతో పాటు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

జీసీసీ కార్యకలాపాలను ఆధునీకరించి గిరిజన ఉత్పత్తులకు జాతీయ స్థాయి మార్కెట్ కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని, గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు పెంచే కార్యక్రమాలు కూడా తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజనుల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని ఈ సందర్భంగా కిడారి శ్రావణ్ కుమార్ ముఖ్యమంత్రిని కోరారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఘనంగా వేడుకలు పోలె శ్రీకాంత్



కుత్బుల్లాపూర్, 17 మార్చి (బిఎన్ఎస్): సుభాష్ నగర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా సుభాష్ నగర్ డివిజన్ లో శ్రీ గాయత్రి స్కూల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా విజయవంతంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ పార్టీ సుభాష్ నగర్ డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వక్త డాక్టర్ అనంతలక్ష్మి, పాల్గొని, మహిళల గౌరవం, విలువలు సమాజంలో వారి ప్రాధాన్యంపై అద్భుతమైన సందేశాన్ని అందించారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని, ఇటువంటి అర్థవంతమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు పోలే శ్రీకాంత్ ని అభినందించారు. సమాజంలో మహిళల పట్ల గౌరవం, మర్యాద పెరగాలని, వారి గొప్ప విలువలను అందరికీ తెలియజేయాలని ప్రసంగకర్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అవకాశం కల్పించినందుకు శ్రీ గాయత్రి విద్యా సంస్థకు పోలే శ్రీకాంత్, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి శ్రీ గాయత్రి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పశుపులేటి నరేంద్ర కృష్ణ, అతిథిగా హాజరై కార్యక్రమానికి అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

# మీ గ్రామం మీ చేతుల్లో.. సమాజ శ్రేయస్సు కొరకు కలసి పనిచేదాం

## ఎస్పీ డా. శబరీష్.,ఐపీఎస్






మహబూబాబాద్, 17 మార్చి (బిఎన్ఎస్): జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణ, మత్తు పదార్థాల నిర్మూలన మరియు సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు మహబూబాబాద్ టౌన్‌లోని పి. ఎస్ .ఆర్ ఫంక్షన్ హాల్‌లో విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని గ్రామ సర్పంచులు, వార్డ్ సభ్యులు, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్లు మరియు వైస్ చైర్మన్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించి, ప్రమాదాల ప్రధాన కారణాలు, నిర్లక్ష్యం వల్ల కలిగే ప్రాణ నష్టం గురించి వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. “ఆరైవ్ అలైవ్ “ కార్యక్రమం ద్వారా సురక్షిత ప్రయాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేశారు. అలాగే సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించేందుకు, గతంలో సీసీ కెమెరాల సహాయంతో ఛేదించిన కేసుల ఫుటేజీలను ప్రదర్శించారు. గ్రామాల్లో మరియు పట్టణాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు నేర నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి గ్రామంలో విస్తృతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రగ్స్ మరియు గంజాయి వాడకం వల్ల యువత భవిష్యత్తు ఎలా దెబ్బతింటుందో వివరిస్తూ, మత్తు పదార్థాలపై ప్రత్యేక వీడియోలను ప్రదర్శించారు. గ్రామ స్థాయిలోనే డ్రగ్స్ నిర్మూలనకు ప్రజాప్రతినిధులు ముందుండాలని, యువతను సరైన మార్గంలో నడిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళలు మరియు చిన్నారుల భద్రత, సైబర్ నేరాలపై కూడా అవగాహన కల్పించారు. ఓ.టి.పి లు, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోకూడదని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100 మరియు సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం 1930 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించాలని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, భద్రత కోసం రూపొందించిన చెక్ లిస్ట్ పోస్టర్‌ను కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులందరి చేత ఆవిష్కరించారు. గ్రామాల్లో అమలు చేయాల్సిన ముఖ్య భద్రతా చర్యలు, యువత మార్గదర్శక అంశాలు ఇందులో పొందుపరచబడ్డాయని అన్నారు.



అలాగే, గ్రామ అభివృద్ధి మరియు శాంతి భద్రతల పరిరక్షణలో ఆదర్శంగా నిలిచిన ఆదర్శ గ్రామ సర్పంచ్‌లకు జిల్లా ఎస్పీ డా. శబరీష్ సన్మానం నిర్వహించి ప్రశంసించారు. జిల్లా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ , సమాజంలో మంచి మార్పు తీసుకురావడంలో గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషిస్తారు. యువతను మత్తు పదార్థాల నుండి దూరంగా ఉంచడం, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడం, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయించడం ద్వారా నేరాలను అరికట్టవచ్చు. గ్రామాభివృద్ధి, యువత భవిష్యత్తు కోసం మీరు ముందుండి పనిచేయాలి. పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రజల భద్రత కోసం కట్టుబడి ఉంది. ప్రజల సహకారం ఉంటేనే సమాజంలో శాంతి, భద్రతలు మెరుగుపడతాయి.” అని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధుల్లో చైతన్యం పెంచి, గ్రామ స్థాయిలో భద్రతా చర్యలను బలోపేతం చేయడం లక్ష్యంగా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ లు గంద్రతి మోహన్, తిరుపతి రావు, కృష్ణ కిషోర్, సీఐలు, ఎస్.ఐలు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సోలం లక్ష్మయ్య కుటుంబానికి తుడుందెబ్బ ఆర్థిక సాయం - నివాళులు అర్పించిన నాయకులు



ములుగు, 17 మార్చి (బిఎన్ఎస్): ఏటూరునాగారం మండలం వీరాపురం గ్రామానికి చెందిన సోలం లక్ష్మయ్య మరణం పట్ల తుడుందెబ్బ సంఘం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఆయన మరణంతో కుటుంబానికి కలిగిన లోటు పూడ్చలేనిదని పేర్కొంది. ఈ నేపథ్యంలో మృతుని కుమారులు సోలం సురేష్, సోలం రమేష్ కుటుంబానికి అండగా నిలుస్తూ, సంఘం తరపున రూ.10,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. నిర్వహించిన లక్ష్మయ్య పెద్దకర్మ కార్యక్రమానికి నాయకులు హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు రమణల లక్ష్మయ్య, పొడెం కృష్ణ ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రావణ్, రాష్ట్ర కార్యదర్శి చింత కృష్ణ, వట్టం జనార్దన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాపుల సమ్మయ్య, ఉపాధ్యక్షులు ఎట్టి రాజబాబు, సహాయక కార్యదర్శులు వట్టం సురేష్, పూనెం నాగేశ్వరావు, పొడెం నర్సింగరావు, కోట సంపత్, కన్నాయిగూడెం మండల అధ్యక్షులు ఆలం రాంబాబు, ఏటూరునాగారం మండల అధ్యక్షులు తాటి నీలాద్రి, ఉపాధ్యక్షులు కోరం సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఈసం పణికుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై సోలం లక్ష్మయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కళ్యాణ మహోత్సవం లో పాల్గొన్న డివిజన్ అధ్యక్షులు



కుత్బుల్లాపూర్ , 17 మార్చి (బిఎన్ఎస్): సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప తెలుగు తల్లి నగర్ లో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన, కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ పవిత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిహెచ్ఎంసి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, ప్రముఖ నాయకులు పుప్పాల భాస్కర్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, హాజరై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం కమిటీ సభ్యులు నిర్వహించిన ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవంలో పాల్గొని భక్తులతో కలిసి ఉత్సాహంగా వేడుకలను ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు అయిన పసుల కృష్ణ, శేఖర్, స్వరూప రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, పసుల లక్ష్మి , బాలకృష్ణ , రామకృష్ణ , లక్ష్మణ్ , డేవిడ్, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# షెడ్యూల్ కులాల సహకార అభివృద్ధి సంఘం నుంచి దరఖాస్తుల ఆహ్వానం




మహబూబాబాద్, 17 మార్చి (బిఎన్ఎస్): జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్., మహబూబాబాద్. జిల్లా ద్వారా 2025-26 సం నకు స్వయం ఉపాధి పథకాలకై ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు కోరనైనదని కార్యనిర్వాహక సంచాలకులు కె. శ్రీనివాసరావు నేడు ఒక ప్రకటనలో తెలిపారు. కావున అర్హులైన షెడ్యూల్డ్ కులములకు చెందిన యువతీ/యువకులు స్వయం ఉపాధి పదకాలకు కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ వాసులు రూ. 1,50,000, పట్టణ వాసులకు 2,00,000 లోబడిన మరియు నాన్ అగ్రికల్చర్ సెక్టార్ పథకాలకు 21-50 సం.ల మధ్య వారు అర్హులని అగ్రికల్చర్ సెక్టార్ పథకాలకు 21-60 సం.ల మధ్య వారు అర్హులని స్కిల్ డెవలప్మెంట్ (ట్రైనింగ్ పథకంలో భాగంగా స్వయం ఉపాది 18-45 సం.ల మధ్య వారు అర్హులు మరియు దినసరి వేతనం పొందే వారికీ వయస్సు 18-35 సం.. ఉండవలెనని అన్నారు. గత 5 సం.లలో ఎస్సీ కార్పొరేషన్ నుండి లబ్ది పొందిన కుటుంబాల వారు అనర్హులన్నారు. ఇట్టి యాక్షన్ ప్లాన్ 2025- 26 లో భాగంగా మూడు రకాల యూనిట్స్ మంజూరు చేయబడునని, ఎలక్ట్రిక్ టూ వీలర్ యూనిట్ విలువ రూ. 1.00 లక్ష. 90 % సబ్సిడీ, 10 % బ్యాంకు ఋణం, ఎలక్ట్రిక్ త్రీ వీలర్ యూనిట్ విలువ రూ.3.00 లక్షలు, 70 % సబ్సిడీ, 30 % బ్యాంకు ఋణం మరియు సోలార్ పంప్ సెట్ యూనిట్ విలువ రూ.7.00 లక్షలు, 60 % సబ్సిడీ, 40 % బ్యాంకు ఋణం, ఈ యూనిట్లకు ధరఖాస్తు చేసుకోడానికి కుల, ఆదాయ, నివాస దృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్ పోర్ట్ సైజు ఫోటో, పట్టాదారు పాసు పుస్తకం (వ్యవసాయ సంబంధిత యూనిట్లకు), (డ్రైవింగ్ లైసెన్సు (రవాణా రంగం యూనిట్లకు) తదితర దృవ పత్రాలతో తేది: 17-03-2026 నుండి 24-03-2026 వరకు ఆన్ లైన్ లో (www.tgobmms.cgg.gov.in) నందు దరఖాస్తు చేసుకొని వెంటనే సదరు దరఖాస్తును సంబందిత దృవ పత్రాలతో కార్యనిర్వాహక సంచాలకులు, ఎస్సి కార్పొరేషన్ మహబూబాబాద్ కార్యాలయము నందు దరఖాస్తులు సమర్పించవలసినదిగా తెలియపరచనైనది. తేది: 24-03-2026 లోపు హార్డ్ కాపీలు కార్యాలయము నందు సమర్పించని వారి దరఖాస్తులు ఎంపిక పరిధిలోకి తీసుకోబడవని గమనించగలరని, ఈ అవకాశాన్ని అర్హులైన ఎస్సి నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోగలరని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే మందుల సామెల్ పై దాడి అనగరికం సిపిఐ,దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన



కుత్బుల్లాపూర్, 17 మార్చి (బిఎన్ఎస్): తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ పై ఆర్ ఎస్ ఎస్,బీజేపీ గుండాల పై దాడిని నిరసిస్తూ జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మందుల శామ్యూల్, పైన ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకులు పరుష పదజాలంతో తిట్టుకుంటూ ఇంటిపైన దాడి చేయడం అనాగరికమైన చర్యని జైశ్రీరామ్ అంటూ ల**కొడకా అని తిట్టడం జై హిందూ మతం అంటూ ఎవరికి పుట్టినావు రా అని తిట్టడం అనేది వారి అహంకారానికి నిదర్శనం అని ఇది రాష్ట్రంలో బిజెపి చేస్తున్నటువంటి కుల రాజకీయాలని బ్రాహ్మణులను తిడితే మొత్తం హిందూ మతాన్ని తిట్టినట్టు ప్రచారం చేసుకోవడం ఈ రాష్ట్రంలో అశాంతిని నెలకొల్పడమేనని ఇలాంటి సంఘటనలు జరగడం వెనకాల మనువాద గుండాల హస్తముందని దీనికి కేంద్ర మంత్రి బండి సంజయ్, లాంటి వాళ్ళ మాటలు కూడా తోడ్పాటు ఇస్తున్నాయని మంచిగా ఉన్నటువంటి రాష్ట్రాన్ని విద్వేషాలకు పెంచుతున్నటువంటి బిజెపి ఆర్ఎస్ఎస్ ఈ సంఘటనతో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించడం జరిగింది. హిందూ మతం పేరుతోటి దాడులు చేయడం మతాన్ని రాజకీయంగా వాడుకోవడం, హిందూ మతం అంటే కేవలం బిజెపి అన్నట్టు ప్రచారం చేసుకోవడం హిందూ మతాన్ని కించపరచడమేనని బండి సంజయ్ ఈ కుట్ర దాడి వెనకాల ఉన్న వారందరూ రాష్ట్రంలోని దళిత బహుజనులకు క్షమాపణలు చెప్పాలని, దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి బెయిల్ రాకుండా చేయాలని లేని పక్షంలో రాష్ట్రంలో ఉన్నటువంటి దళిత బహుజనులతో పాటు సిపిఐ కూడా బిజెపికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సీనియర్ నాయకులు లింగయ్య ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకన్న మాదిగ జర్నలిస్టు నాయకులు రామస్వామి, తొండ వెంకట్, గణేష్, నరేష్, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు బాబు వల్లూరి బాబు,వెంకటేష్ సోమయ్య, హిందూ బిసి మహాసభ నాయకులు నరహరి, జై భీమ్ నాయకులు అల్వాల భాస్కర్,పరుశరాములు అశోక్ అరుణ్ సిపిఐ నాయకులు ఇమామ్,ముసలయ్య,పలు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# బోగ్గారపు రామయ్య కుటుంబ సభ్యులకు మాజీ ఎం.పీ నామ పరామర్శ.



ఖమ్మం,17 మార్చి (బిఎన్ఎస్): ఖమ్మం కార్పొరేషన్, ఇల్లందు రోడ్ లోని ప్రగతి ఫ్రైడ్ కాలనీకి చెందిన బొగ్గారపు రామయ్య, ఇటీవల మరణించిన విషయం విధితమే కాగా మంగళవారం మధ్యాహ్నం బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎం.పీ నామ నాగేశ్వరరావు వారి స్వగృహానికి వెళ్లి, రామయ్య చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులర్పించారు. రామయ్య అల్లుడు మందటి నరేష్ చౌదరి, కుమార్తె కౌముదిని, కుమారులు రణధీర్, అభినవ్ తో పాటు వారి కుటుంబ సభ్యులను మాజీ ఎం.పీ నామ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ నాయకులు తాళ్లూరి జీవన్ కుమార్ తో పాటు, పొట్ల హరినాధ్ బాబు, మాజీ పిఏసీఎస్ చైర్మన్ మన్నే బాలకృష్ణ, గుంటుపల్లి రఘు బాబు, యనమద్ది రాధాకృష్ణ, దేవభక్తని హేమంత్, బీఆర్ఎస్ నాయకులు వాకదాని కోటేశ్వరరావు, రేగళ్ల కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# సినిమా న్యూస్

## చిరంజీవితో అలాంటి సినిమా కచ్చితంగా తీస్తా: హరీశ్ శంకర్



ఉగాది సందర్భంగా విడుదల కానున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' ప్రమోషన్లలో బిజీగా ఉన్న దర్శకుడు హరీశ్ శంకర్, చిరంజీవి, పవన్ కల్యాణ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ట్రైలర్ చూసిన చిరంజీవి 20 నిమిషాలు మాట్లాడి డైలాగులు, పవన్ లుక్‌ను ప్రశంసించారని తెలిపారు. పవన్‌పై ఆయనకున్న ప్రేమ తమ్ముడికంటే కొడుకులా అనిపించిందన్నారు.

చిరంజీవితో సినిమా ప్రాసెస్‌లో ఉందని, 'రౌడీ అల్లుడు', 'దొంగ మొగుడు', 'గ్యాంగ్ లీడర్' తరహాలో ఓ కమర్షియల్ ఎంటర్‌టైనర్ తీస్తానని చెప్పారు.

పవన్ కల్యాణ్‌ను గొప్ప వ్యక్తిగా పేర్కొంటూ, చిన్నప్పటి నుంచే సామాజిక అవగాహనతో ఉన్నారని అన్నారు. సినిమాల్లోనూ సందేశాత్మక పాటల ద్వారా ఆ ఆలోచనలను వ్యక్తం చేస్తారని, సహజ నటన కోసం ఎంతో కష్టపడతారని హరీశ్ శంకర్ ప్రశంసించారు.



## సీఎస్‌కే ఈవెంట్‌లో 'పెద్ది' హంగామా.. రెహమాన్ లైవ్‌తో రచ్చ!

ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందు చెన్నై సూపర్ కింగ్స్ అభిమానుల కోసం భారీ ఈవెంట్‌కు సిద్ధమవుతోంది. మార్చి 22న చెన్నైలోని చిదంబరం స్టేడియంలో జరిగే ఈ కార్యక్రమంలో ఏఆర్ రెహమాన్ లైవ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నారు.

ఈ వేడుకలో ఆయన క్లాసిక్ హిట్స్‌తో పాటు రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' చిత్రంలోని పాటలను కూడా ఆలపించనున్నట్లు సమాచారం. బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

ఇప్పటికే 'పెద్ది' పాటలు మంచి స్పందన పొందుతున్న నేపథ్యంలో, ఐపీఎల్ వేదికపై ఈ పాటలు వినిపించడంతో సినిమాకు మరింత క్రేజ్ పెరగనుంది.

## 'రాకాస'కు స్ట్రాంగ్ డిస్ట్రిబ్యూషన్.. రిలీజ్‌కు ముందే భారీ హైప్!



రాకాస చిత్రం విడుదలకు ముందే భారీ హైప్‌ను సొంతం చేసుకుంది. తెలుగు రాష్ట్రాల్లో శ్రీ లక్ష్మీ నరసింహ మూవీ మేకర్స్ విడుదల చేస్తుండగా, ఓవర్సీస్‌లో అథర్వణ భద్రకాళి పిక్చర్స్ ద్వారా 350కి పైగా స్క్రీన్లలో రిలీజ్‌కు ప్లాన్ చేశారు. నార్త్ అమెరికా, యూకే మార్కెట్లలో ప్రత్యంగిరా సినిమాస్ డిస్ట్రిబ్యూషన్ బాధ్యతలు చేపట్టింది. ఏప్రిల్ 2న ప్రీమియర్స్, ఏప్రిల్ 3న వరల్డ్‌వైడ్ రిలీజ్ కానుంది.

నాన్-థియేట్రికల్ హక్కుల్లో భాగంగా డిజిటల్ స్ట్రీమింగ్‌ను నెట్ఫ్లిక్స్ దక్కించుకోగా, ఆడియో హక్కులు సరిగమ సొంతం చేసుకుంది.

సంగీత్ శోభన్ హీరోగా, నయనర్ సారిక హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. మానస శర్మ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రానికి అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే టీజర్, పాటలకు మిలియన్ల వ్యూస్ రావడంతో సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి.

## 'హ్యాపీ రాజ్' నుంచి 'అద్దిరా లెక్క'.. జివి ప్రకాష్ ఎనర్జీ సాంగ్ హిట్!



జివి ప్రకాష్ కుమార్ హీరోగా నటిస్తున్న 'హ్యాపీ రాజ్' చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ "అద్దిరా లెక్క" విడుదలైంది. మరియా రాజా ఎలాంచెజియన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్‌గా నటిస్తున్నారు. జస్టిన్ ప్రభాకరన్ స్వరపరిచిన ఈ పాటకు గోవింద్ ప్రసాద్ ఎనర్జీతో గానం చేయగా, రెహ్మాన్ అందించిన సాహిత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాంగ్‌లో జివి ప్రకాష్ డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. బియాండ్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 27న తమిళం, తెలుగులో విడుదల కానుండగా, మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ LLP ద్వారా తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ అవుతోంది. ఇప్పటికే ఈ సినిమాపై పాజిటివ్ బజ్ నెలకొంది

## విజయదశమికి 'ఫౌజీ' ఫిక్స్.. ప్రభాస్ మూవీపై భారీ అంచనాలు



ప్రభాస్ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉండగా, హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న హిస్టారికల్ వార్ డ్రామా 'ఫౌజీ'పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

మొదట ఈ సినిమాను దసరాకు విడుదల చేయడంపై అనుమానాలు వ్యక్తమైనా, మేకర్స్ మాత్రం 2026 విజయదశమి సందర్భంగా రిలీజ్ చేయాలని గట్టిగా ఫిక్స్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం షూటింగ్ వేగంగా సాగుతుండగా, జూలై-ఆగస్టు నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి దర్శకుడు హను రాఘవపూడికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సినిమాతో ఇమాన్వీ టాలీవుడ్‌కు పరిచయం అవుతోంది.

అన్ని అనుకున్నట్లే జరిగితే, 'ఫౌజీ'తో ప్రభాస్ మరోసారి పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

## ఆస్కార్ గుర్తింపు అవసరం లేదు ఆస్కార్‌పై ఈషా వ్యాఖ్యలు

ఆస్కార్ వేడుకలో ధర్మేంద్రకు తగిన గౌరవం దక్కలేదన్న విమర్శలపై ఆయన కుమార్తె ఈషా స్పందించారు. 'ఇన్ మెమోరియం' విభాగంలో పేరు లేకపోవడం తన తండ్రికి పెద్ద విషయం కాదని, ఆయన ఎప్పుడూ గుర్తింపుల కోసం ప్రయత్నించలేదని తెలిపారు.

ప్రేక్షకుల ప్రేమే ఆయనకు గొప్ప అవార్డు అని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని హేమమాలిని కూడా సమర్థిస్తూ, అభిమానుల అభిమానమే ధర్మేంద్రకు నిజమైన గౌరవమని అన్నారు.

లైవ్ టెలికాస్ట్‌లో పేరు లేకపోయినా, ఆస్కార్ అధికారిక వెబ్‌సైట్‌లో ఆయనను చేర్చడం గమనార్హం.



## రిలీజ్‌కే ముందు రూ.130 కోట్లు.. 'ధురంధర్ 2' రికార్డు హవా

రణవీర్ సింగ్ హీరోగా, ఆదిత్యధర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ధురంధర్ 2' విడుదలకు ముందే సంచలనం సృష్టిస్తోంది. మార్చి 19న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమైన ఈ యాక్షన్ థ్రిల్లర్ అడ్వాన్స్ బుకింగ్స్‌లోనే భారీ వసూళ్లు సాధించింది.



పెయిడ్ ప్రివ్యూల ద్వారా రూ.40.54 కోట్లు, మొదటి రోజు అడ్వాన్స్ బుకింగ్స్‌లో రూ.29 కోట్లు, ఓవర్సీస్‌లో రూ.60 కోట్లకు పైగా వసూలు చేసి మొత్తం రూ.130 కోట్ల మార్క్‌ను రిలీజ్‌కు ముందే దాటినట్లు సమాచారం.

దేశవ్యాప్తంగా సుమారు 15,000 థియేటర్లలో విడుదలవుతున్న ఈ చిత్రం ఇప్పటికే లక్షల టికెట్లు అమ్ముడవడంతో భారీ ఓపెనింగ్స్‌కు సిద్ధమైంది. పాన్ ఇండియా స్థాయిలో పలు భాషల్లో విడుదలవుతున్న ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.



## పవన్‌తో నటించడం డ్రీమ్

### 'ఉస్తాద్ భగత్ సింగ్'పై శ్రీలీల

శ్రీలీల, పవన్ కల్యాణ్తో కలిసి నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్'పై ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఉగాది సందర్భంగా మార్చి 19న విడుదల కానుంది.

పవన్‌తో ఫస్ట్ సీన్ చేస్తున్నప్పుడు ఆశ్చర్యంతో చూసేంతగా ఆయనపై అభిమానముందని చెప్పారు. 'ఖుషి', 'జల్సా' సినిమాలు తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. ఈ సినిమాలో పవన్‌తో పెద్దగా డ్యాన్స్ లేకుండా, క్యూట్ సన్నివేశాలు ఉంటాయని తెలిపారు.పవన్ కల్యాణ్ ఎంతో సాధారణంగా ఉండే వ్యక్తి, ఫ్యాన్స్ కోసం ఏ సీన్ అయినా చేసేస్తారని అన్నారు. సినిమాల్లో బిజీగా ఉంటూనే ఎంబీబీఎస్ పూర్తి చేయడం కష్టమని, తన తల్లి సహాయం వల్ల సాధ్యమైందని చెప్పారు.

'పెళ్లిసందడి' సమయంలో అభిమానులు చేసిన సంబరాలు ఇప్పటికీ గుర్తుండే అనుభూతి అని తెలిపారు. 'ఉస్తాద్ భగత్ సింగ్'ను మాస్ థియేటర్‌లో చూడాలని ఉందని, ఈ సినిమా ఫ్యాన్స్‌కు పండగలా ఉంటుందని శ్రీలీల చెప్పారు